**International Journal of Academic Research**
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

# కనుపర్తి వరలక్ష్మమ్మ రచనలు–సాంఘిక దురాచారాలు-సామాజిక చైతన్యం

**డాక్టర్ కాకుమాను శ్రీదేవి**

తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామచంద్రపురం

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు తన రచనల్లో ప్రధానంగా ఆనాటి సంఘంలోని అనేక సామాజిక అంశాలను గురించి ప్రస్తావించారు. అందులో కూడా ప్రధానంగా బాలికలు, స్త్రీలను గురించి వారి సంక్షేమం గురించి ఆమె పేర్కొన్నారు. వరలక్ష్మమ్మ గారి రచనల్లో కనిపించే సామాజిక అంశాలలో ప్రధానంగా స్త్రీ విద్య , బాల్యవివాహాలు, వరకట్నం దురాచారం, మూఢనమ్మకాలు మొదలైనవి పేర్కొనదగినవి.కనుపర్తి వరలక్ష్మమ్మ గారిలో సామాజిక స్పృహ చిన్నతనంలోనే కలిగింది. ముఖ్యంగా మహిళ అభ్యుదయ భావాలు ఆమెలో చిగురించడానికి, బాపట్లలో ఒకసారి కొటికలపూడి సీతమ్మ గారు స్త్రీ విద్యా ఆవశ్యకతని గురించి చేసిన ఉపన్యాసం ఎంతో దోహదం చేసింది. బాలికగా ఉన్న వరలక్ష్మమ్మ ఆ ఉపన్యాసం విని, తాను కూడా చదువుకోవాలని అనుకున్నారు.ఆ తరువాత సామాజిక సేవ చేస్తూ, స్త్రీ అభ్యుదయానికీ, స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేయాలని నిశ్చయించుకున్నారు.ఆ తరువాత తను నేర్చిన విద్యనీ, తన ఆలోచనల్నీ, తక్కిన స్త్రీలకు అందించాలని ఆశయంతో కొందరు స్త్రీలకు ఉపన్యాసాలు ఇచ్చి, సామాజిక సేవకి శ్రీకారం చుట్టారు.

**స్త్రీ విద్య:-**

ఆధునిక కాలంలో తల్లిదండ్రులు తమ కుమార్తెలకు ఇవ్వగల శక్తివంతమైన మరియు విలువైన బహుమతి విద్య మరియు స్వాతంత్రం మాత్రమే. ఇది స్త్రీలకు ఆర్థికంగా దృఢంగా ఉండటానికి, కుటుంబానికి సహాయకారిగా ఉండటానికి ఎంతగానో దోహదపడుతుంది. అంతే కాకుండా కుటుంబంలో స్త్రీకి తగిన గౌరవాన్ని, హోదాను కూడా అందిస్తుంది. కాబట్టి బాలికలకు మంచి విద్యను అందించడం మరియు వారికి నచ్చినటువంటి వృత్తిని ఎంచుకోమని ప్రోత్సహించటం తల్లిదండ్రుల బాధ్యత. ఈ దృక్పథంతో కనపర్తి వరలక్ష్మమ్మ గారు తన రచనల్లో స్త్రీ విద్యకు అధికమైన ప్రాధాన్యతను ఇచ్చారు. అంతేకాకుండా వరలక్ష్మమ్మ గారు స్త్రీ విద్యకు దోహదం కలిగించే విధంగా తన రచనల్లో సన్నివేశాలను, సందర్భాలను, పాత్రలను కల్పించారు. చదువుకున్న స్త్రీకి సహజంగా లభించే మనోధైర్యం, గుండె నిబ్బరం, కష్టాలు తట్టుకునే దృఢ సంకల్పం మొదలైన గుణాలను వరలక్ష్మమ్మ గారు 'కన్యాశ్రమము' కథలో 'జానకి' అనే పాత్ర ద్వారా తెలియజేశారు. "ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు"అన్నారు పెద్దలు. అందుకే చదువుకున్న అమ్మాయి అయితే జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని ధైర్యంగా ఎదుర్కొని, ఒక పరిష్కారం మార్గాన్ని కూడా స్వయంగా చూసుకోగలరు అని వరలక్ష్మమ్మ గారు 'జానకి 'పాత్ర ద్వారా వ్యక్తం చేసినారు. భర్త చనిపోయిన తర్వాత జానకి తనకు వచ్చిన ఆస్తిని మొత్తాన్ని కన్యాసం స్థాపించడానికి వినియోగించాలని అనుకుంటుంది. కాకుండా కట్నం ఇచ్చుకోలేని కన్యలకు వివాహం చేయడం మాత్రమే కాకుండా. వివాహం అయ్యే వరకు ఆ యువతలకు చదువు చెప్పించాలని కూడా జానకి భావిస్తుంది. ఇటువంటి మంచి ఆలోచన జానకికి కలగటానికి కారణం ఆమె చదువుకోవటమే అని చెప్పవచ్చు.

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు రచించిన 'ప్రణయ లేఖలు' కథలో ఆ కాలంలో చదువుకునే యువతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, కుటుంబం మరియు సమాజం నుంచి వారి చదువుకి ఎటువంటి ఆటంకాలు కలుగుతున్నాయి అనే అంశాలను చక్కగా వివరించారు.

కనపర్తి వరలక్ష్మి గారు రచించిన 'వసుమతి' నవలలో ప్రధాన పాత్ర వసుమతి. ఆమె తన అన్న రామచంద్రుడు ప్రోత్సాహం వల్ల చదువు పట్ల ఆకర్షితురాలు అవుతుంది. రామచంద్రుడుకి గల స్త్రీ విద్యాభిమానం వలన వసుమతికి స్వయంగా ఇంగ్లీషు, వ్యాకరణం, చందస్సు, చరిత్ర మొదలైన పాఠాలన్నీ శ్రద్ధతో చదివిస్తూ ఉండేవాడు. వసుమతి నవలలో వసుమతి భర్త ఆనందరావు లాంటి స్త్రీ విద్యా ద్వేషులు కూడా ఉన్నారని కనుపర్తి వరలక్ష్మమ్మ గారు ఈ నవలలో పేర్కొన్నారు. వసుమతి భర్త ఆనందరావు పెళ్లయిన తర్వాత ఆమెను చదువుకోరాదని, కనీసం పుట్టింటికి ఉత్తరాలు కూడా రాయకూడదని నిర్బంధం చేశాడు. అదే సమయంలో వసుమతి అన్న రామచంద్రుడు తన భార్య త్రిపుర సుందరిని చక్కగా చదువుకోమని చక్కగా ప్రోత్సహిస్తాడు. స్త్రీ విద్య వల్ల కలిగే సామాజిక చైతన్యానికి వసుమతి నవలలు ప్రధాన పాత్ర అయినా వసుమతి ఒక చక్కటి నిదర్శనమని చెప్పవచ్చు. స్త్రీకి విద్యను అందించడం ద్వారా ఆమె జీవితంలోనూ, సమాజంలోనూ ఎదురయ్యే ఎటువంటి కష్టాలనైనా తట్టుకొని ధైర్యంగా ముందడుగు వేయగలరని కనపర్తి వరలక్ష్మమ్మ గారు ఈ నవలలో వసుమతి పాత్ర ద్వారా నిరూపించారు. అయితే ఒక మంచి పుస్తకం పక్కన ఉంటే మంచి మిత్రుడు మనతో ఉన్నట్లే అనే మాట సత్యం. అందుకు నిదర్శనంగా మొదట దుర్మార్గుడిగా ఉన్న ఆనందరావు రంగూన్ లో అతని ఆదరించిన సుందర్ రావు అనే ఒక మంచి స్నేహితుని వల్ల 'హరిదాసి' అనే పుస్తకం చదివి పశ్చాతాపం పొంది, ఆ తరువాత సత్ప్రవర్తన కలిగి వసుమతితో చక్కగా కాపురం చేసుకున్నాడు. ఈ నవలలో కనుపర్తి వరలక్ష్మమ్మ స్త్రీ విద్య ఆవశ్యకతను గురించి చెప్పారు.

**బాల్య వివాహాలు:-**

బాల్య వివాహం అనగా స్త్రీ పురుషులకు యుక్త వయసు రాకముందే చేసే పెళ్లి, అనగా బాల్య వయసులోనే బాల బాలికలకు చేసే వివాహం. మన సమాజంలో పూర్వం బాల్యవివాహాలు ఎక్కువగా జరిగేవి. కుటుంబాల మధ్య సంబంధం బాంధవ్యాలను పటిష్టపరచుకోవటానికి, ఆడపిల్ల పుట్టగానే తమ బంధు వర్గంలో ఫలానా వాడికి భార్య పుట్టిందని నిర్ణయించుకునేవారు. అందువల్ల ఆడపిల్లలు కొంచెం పెద్దవారు అవగానే వివాహం చేసేవారు. అయితే బాల్య వివాహం జరిపించినప్పటికీ కూడా అమ్మాయి యుక్తవయసు వచ్చిన తర్వాత మాత్రమే కాపురానికి పంపించేవారు. ఇలా చేయటం వల్ల అమ్మాయికి, అబ్బాయికి ఒకరిపై ఒకరు ఇష్టం ఉన్న లేకపోయినా కలిసి జీవితం గడపాల్సి వచ్చేది. ఒకవేళ పురుషుడు ముందుగా చనిపోయినప్పటికీ, స్త్రీలకు పునర్వివాహాలు ఉండేవి కావు. అందువల్ల భర్త చనిపోయిన తర్వాత ఆ అమ్మాయి చిన్న వయసులోనే బాలవితంతువుగా మారి జీవితాంతం అలానే ఉండవలసి వచ్చేది. అందువల్లనే ఆనాడు అనేకమంది సంఘసంస్కర్తలు బాల్యవివాహాలను నిరసిస్తూ, అనేక ఉద్యమాలు చేపట్టారు. బాల్య వివాహాలు నిరసిస్తూ రచనలు చేసిన రచయిత్రులలో కనుపర్తి వరలక్ష్మమ్మ గారు ప్రముఖంగా పేర్కొనదగిన వారు.

వరలక్ష్మమ్మ గారి కథల్లో మనకు ఎక్కువగా మహిళా అభ్యుదయం, సంఘసంస్కరణ, సాంఘిక దురాచార

This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

నిరసన అనేవి ప్రధానంగా కనిపిస్తాయి. అందులో బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, కష్టనష్టాలను గురించి కన్యాశ్రమము కథలో పరోక్షంగా ప్రస్తావించటం కనిపిస్తుంది. ఈ కథలో వరకట్న సమస్య ప్రధానమైనప్పటికీ, వరకట్నం ఇవ్వలేక జానకిని ఒక ముసలవానికి ఇచ్చి పెళ్లి చేయటం, కొంతకాలానికి అతను అనారోగ్యంతో చనిపోవడం వల్ల ఆమె బాల్య వితంతువుగా మారుతుంది. ఫలితంగా జానకి జీవితం సర్వం దుర్భరంగా మారుతుంది.

వరలక్ష్మమ్మ గారు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను పరోక్షంగా ప్రస్తావించటం కనిపిస్తుంది.

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు రచించిన తొలి నవల ' వసుమతి'. ఈ సాంఘిక నవలలో మనకు బాల్య వివాహాల ప్రస్తావన విశేషంగా కనిపిస్తుంది. వరలక్ష్మమ్మ గారు ప్రధానంగా ఆనాటి సమాజంలో ఒక ప్రభలమైన దురాచారంగా వ్యాపించి ఉన్నటువంటి బాల్య వివాహాలను గురించి, వాటి పర్యవస్థానంగా స్త్రీల జీవితాలకు కలిగే కష్టనష్టాల గురించి తెలియ చెప్పటానికి ఈ నవల రాశారని చెప్పవచ్చు. ఈ నవలలో ఆనాటి సాంఘిక ఆచారాల ప్రకారం వసుమతి తల్లి అయినా మహాలక్ష్మమ్మకు చిన్నతనంలోనే బాల్య వివాహం చేస్తారు. మహాలక్ష్మమ్మ భర్త సీతారామయ్య న్యాయవాదిగా గొప్ప పేరు పొందాడు అయితే విధి వక్రించి, సీతారామయ్య హఠాత్తుగా అనారోగ్యంతో చనిపోతాడు. అది మహాలక్ష్మమ్మ జీవితాన్ని తలకిందులు చేసింది. భర్త చనిపోయిన తర్వాత మహాలక్ష్మమ్మ తన బిడ్డల సంరక్షణతోనే కాలాన్ని గడిపింది. వసుమతి నవలలో ప్రధాన పాత్ర అయినా వసుమతికి కూడా బాల్య వివాహం చేస్తారు. అయితే వసుమతి భర్త ఆనందరావు చెడు అలవాట్లకు లోనై, వేశ్య అయినా నాగమణితో సంబంధం పెట్టుకుని ఆమెను చిత్రహింసలు పెడుతూ ఉంటాడు. భరిస్తుంది చివరికి నాగమణి ప్రోత్సాహంతో ఆనందరావు తన భార్యను వదిలిపెట్టి రంగూన్ వెళ్లిపోతాడు. రంగూనులోనే పరిచయమైనా ఒక తెలుగు వ్యక్తి సుందర్రావు సహవాసంలో ఆనందరావుకి జ్ఞానోదయమై, తిరిగి స్వగ్రామం వచ్చి వసుమతితో చక్కగా సంసారం చేసుకుంటాడు. కనుపర్తి వరలక్ష్మమ్మ వసుమతి నవల లో బాల్య వివాహాల గురించిన ప్రస్తావన, వాటి ఫలితంగా కలిగే దుష్పరిణామాలు గురించిన వర్ణనలు కనిపిస్తాయి.

**వరకట్న దురాచారం:**

వరకట్నం అనేది సమాజంలో తరాలుగా సంక్రమిస్తూ వస్తున్న ఒక సామాజిక దురాచారం. ఇది మహిళల వైవాహిక జీవితం ఎంతో తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపుతున్న ఒక దుర్మార్గమైన అలవాటుగా మారింది. అంతేకాకుండా ఈ వరకట్న సమస్య భారతీయ వివాహ వ్యవస్థను ఎంతగానో కలుషితం చేసిందని చెప్పవచ్చు. వరకట్నం అనేది వివాహ సమయంలో వధువు ఆమె అత్తమామలకు నగదు లేదా వస్తు రూపంలో చేసే చెల్లింపు. వరకట్నం వల్ల చాలామంది మహిళలు వివాహం చేసుకోకుండానే మిగిలిపోతున్నారు. ఒకవేళ పెళ్లి అయినప్పటికీ అనేకమంది స్త్రీల జీవితాలను వారి భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం చిత్రహింసలు పెట్టటం. ఒక్కోసారి ప్రాణాలు తీయడం కూడా మనం అనేక సందర్భాల్లో చూస్తున్నాం. ఆధునిక కాలంలో కుడా వరకట్నం కోసం జరుగుతున్న ఇటువంటి దుర్మార్గపు సంఘటనలు నాగరిక సమాజానికి ఒక చెరగని కళంకం అని చెప్పాలి. అందువల్లనే కనుపర్తి వరలక్ష్మమ్మ గారు తమ రచనలలో తరచుగా వరకట్న సమస్యను గురించి ప్రస్తావించారు.

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు రచించిన కన్యాశ్రమము అనే కథ ద్వారా ఆనాటి సమాజంలో వరకట్న సమస్య ఎంత దుర్భరంగా ఉన్నదో తెలియజేశారు. అదే సమయంలో వరకట్న దురాచారానికి బలైపోతున్న జానకి వంటి కన్య యొక్క మనోవేదన కూడా తెలియజేశారు. మన దేశంలో ఉన్న వరకట్న దురాచారం అనేటువంటి సమస్య కన్యల పాలిట ఎంతో దుర్భరమైన శాపంగా మారి బాధిస్తున్నది. కట్నం లేకుండా తల్లిదండ్రులు తమ కుమార్తెలకు వివాహం చేయలేక ఎంతగా వేదన పడుతున్నారు అనే విషయం ఈ కథలో రామారావు మాటల్లో మనకి తెలుస్తుంది. పెళ్లి సంబంధాలకు వచ్చే వియ్యంకుల స్థాయిని బట్టి రమణారావు తండ్రి వరకట్నం 5000, 10000, 15000 అంటూ వేలం పాట లాగా పెంచుకుంటూ పోతాడు. అంతేకాకుండా బంధుత్వం ఉన్నప్పటికీ కూడా కట్నం ఇవ్వలేరని జానకితో పెళ్లి చేయకుండా, కట్నం కోసం డబ్బున్న అమ్మాయిని తన కొడుకుకి ఇచ్చి పెళ్లి చేయాలని అనుకుంటాడు. ఈ సంఘటన ఆనాడు సమాజంలో కొడుకులు గల తల్లిదండ్రులకు వరకట్నం మీద గల దురాశను తెలియజేస్తుంది.

ఈ కథలో ఒక ముఖ్య పాత్ర అయినా జానకికి పెళ్లి చేయటానికి కట్నం ఇచ్చే స్తోమత లేక ఆమెను ఒక ముసలివాడికి ఇచ్చి పెళ్లి చేస్తారు. అతను కొంతకాలానికి అనారోగ్యంతో చనిపోతాడు. అప్పుడు ఆమెను చూడటానికి వచ్చిన రమణారావుతో బావ నా పెళ్లి సంగతి చూశావుగా కట్నం ఇచ్చుకునే శక్తి లేక ముసలివాడిని కట్టుకొని ఈ గదికి వచ్చాను. మది తరగతి కుటుంబాలలో పుట్టిన కన్యలకు వరకట్నాలు పిశాచి పీడగా భావిస్తున్నాయి. అనేకమంది దీనికి బలైపోతున్నారు లేదా, అవివాహితులుగా ఉండిపోతున్నారు. తన భర్త సంపాదించిన ధనంతో ఒక కన్యాశ్రమము పెట్టి, వరకట్నం ఇచ్చుకోలేని మొదటి కుటుంబాల్లోని కన్యలకు వరకట్న నిషేధ దీక్షితులైన వరులను ఇచ్చి వివాహాలు చేద్దామని జానకి రమణరావు సహాయంతో ఆమె భర్త సంపాదించిన ధనంతో కన్యాశ్రమము ఏర్పాటు చేస్తుంది. దాని ద్వారా వరకట్నం తీసుకొని యువకులకు కన్యలను ఇచ్చి వివాహం చేయాలని నిర్ణయించుకుంటుంది.ఈ కథలో స్నేహితులైన రమణారావు, రాజేశ్వరరావు అనే ఇద్దరు కట్నం తీసుకోకుండా ఆదర్శ వివాహాలు చేసుకుంటారు. అందువల్లనే వరలక్ష్మమ్మ గారు ఈ కథలో రామణరావు లాంటి చదువుకున్న ఆదర్శవంతమైన యువకులు సమాజానికి తనవంతుగా ఎటువంటి సహాయం చేయవచ్చును అనేది మనకు తెలియజేశారు. అలాగే రాజేశ్వరరావు వంటి యోగ్యులైనటువంటి యువకులు వరకట్న దురాచారానికి పాల్పడకుండా చదువుకున్న కన్యలకు మంచి జీవితాన్ని అందించవచ్చు అని కూడా ఈ కథ మనకు తెలియజేస్తుంది.

కనుపర్తి వరలక్ష్మి గారు రచించిన వసుమతి నవలలు ప్రధాన పాత్ర వసుమతి. ఆ కాలంలో కన్యాదాతలను పీల్చి పిప్పి చేసే వరకట్న దురాచారం, అత్త ఆడబిడ్డల మర్యాదలు వసుమతి పెళ్లి సందర్భంలో మహాలక్ష్మమ్మ గారిని అనేక బాధలకు గురి చేసాయి. చివరకు మంచి సంబంధం కోసం విచారించి ఆమె ఎంతగానో వేసాయి పోయింది. చివరికి నరసరావుపేటలో తహసీల్దారుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం తమ్ముడు ఆనందరావుకు రెండు వేల రూపాయల వరకట్నంతో వసుమతి ఇచ్చి వివాహం చేసింది. అయితే ఆనందరావు చెడు వ్యసనాల గురించి తెలిసి, జీవితాన్ని అన్యాయం చేశామని తన అన్న రామచంద్రుడు ఎంతగానో బాధపడ్డాడు. తన తల్లి తొందరపాటు చేత వసుమతి గొంతు కోసింది అని రామచంద్రుడు ఎంతగానో విచారిస్తాడు.

**International Journal of Academic Research**
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు పిల్లల నాటికలు అనే పేరుతో సుమారు 15 నాటికలు రచించారు. ఇందులోని ఎదురు ప్రశ్నలు అనే నాటికలో అమ్మాయి ఇంట్లో జరిగే పెళ్లిచూపులు వ్యవహారం ప్రధాన ఇతివృతం. పెళ్లి చూపుల వ్యవహారంలో పెళ్ళికొడుకు వాళ్లు వరకట్నం కోసం బేరాలు చేయటం, పెళ్లికూతురు తల్లిదండ్రులు బంధువులు అబ్బాయి తరుపువారిని ఒప్పించడానికి చేసే ప్రయత్నాలు మనకు కనిపిస్తాయి. అయితే పెళ్లి కొడుకు ఎంతటి వ్యసనపరుడు అయినప్పటికీ అమ్మాయిలు వరకట్నం ఇచ్చుకోవాల్సి రావటం దౌర్భాగ్యం అని, ఆడపిల్లల తల్లిదండ్రులు మోసకారి పెళ్లి కొడుకుల విషయంలో జాగ్రత్త వహించాలని ప్రకాశం పాత్ర ద్వారా ఈ నాటకంలో కనుపర్తి వరలక్ష్మమ్మ గారు తెలియజేశారు.

అదేవిధంగా వరలక్ష్మమ్మ గారు గోల్డ్ కంట్రోల్ అనే నాటికలో కూడా వరకట్న సమస్యను గురించి ప్రస్తావించారు. ఆ రోజుల్లో ఆడపిల్లలకు పెళ్లి చేయటానికి తల్లిదండ్రులు దుబారాగా ఖర్చు చేసే బంగారం గురించి ఈనాటిక మనకు తెలియజేస్తుంది. అంతేకాకుండా రిజిస్టర్ పెళ్లిళ్ల అవసరాన్ని కూడా ఈ నాటిక మనకు గుర్తుచేస్తుంది. అయితే ఆ మాటలు విని పరంధామయ్య మంగళ వాయిద్యాలు, పురోహితుడు, మంత్రాలు లేకుండానే రిజిస్టర్ ఆఫీసులో పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది కదా అని విచారిస్తాడు. వరలక్ష్మమ్మ గారు రచించిన కొత్త కోడలు నాటికలో కూడా వరకట్నాల ప్రస్తావన వస్తుంది. ఆనాటి సమాజంలోని అత్తలు చదువుకోకుండా ఇంటి పని, వంట పని తెలిసిన, కట్నం తీసుకొచ్చే కోడల్ని ఎక్కువగా ఇష్టపడేవారు. అంతేకాకుండా చదువుకున్న కోడలు అయితే అణకువగా ఉండదని వాళ్ళ నమ్మకం. తనకి ఇష్టం లేకపోయినా, తన కొడుకు చదువుకున్న పిల్లను పెళ్లి చేసుకున్నాడని జానకమ్మ అంటుంది. అయితే రంగమ్మ మాత్రం వాళ్లు కట్నం తీసుకొని రాకపోయినా, భార్యాభర్తలు ఇద్దరూ కలిసి అన్యోన్యంగా ఉంటే తల్లిదండ్రులకు అంతకంటే ఏం కావాలి అంటుంది. ఈ విధంగా ఈ నాటికలో వరలక్ష్మమ్మ గారు వరకట్నం గురించి, స్త్రీ విద్య గురించి భిన్నమైన అభిప్రాయాలు వెల్లడించారు.

**మూఢ నమ్మకాలు:**

నమ్మకం అనేది మనిషి ఎదుగుదలకు పునాది లాంటిది . మూఢనమ్మకం అనేది మనిషి ఎదుగుదలకు అడ్డుగోడ లాంటిది. వర్తమాన సమాజంలో నమ్మకం అనే పేరుతోనే అనేక మూఢనమ్మకాలను పాటించేవారు చాలామంది ఉన్నారు. దీనివల్ల వారికి మాత్రమే కాదు, చుట్టూ ఉన్న వారి జీవితాలకు కూడా ఏదో ఒక రూపంలో ఇబ్బంది అనేది ఎదురవుతుంది. మనదేశంలో ఎన్నో మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాలు తరాలుగా ప్రజలలో పాతుకుపోయి ఉన్నాయి. సాధారణంగా హేతుబద్ధమైన మంచి నమ్మకాల వల్ల సదాచారాలు అనేవి కూడా వ్యవహారం లోకి వస్తాయి. అయితే మనుషుల లోని మూఢనమ్మకం తోనే దురాచారం అనేది కూడా పుట్టి, వాడుకలోకి వస్తుంది. సమాజంలోని ఈ మూఢనమ్మకాలు ఎక్కువగా నిరక్షరాస్యులు అయినా వారి లోను, గ్రామాల లోను, ఆదివాసీ, గిరిజన సమూహాల లోను కనిపిస్తాయి. అందుకు ప్రధాన కారణం పేదరికం, నిరక్షరాస్యత, అనాగరికత అని చెప్పవచ్చు.

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు తన రచనలలో అనేక సందర్భాలలో ఆనాటి సమాజంలోని మూఢనమ్మకాల గురించి ప్రస్తావించారు. తద్వారా ఆ మూఢ నమ్మకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, వాటి నుంచి బయటపడేలా

చేయటానికి వరలక్ష్మమ్మ గారు ప్రయత్నించారని చెప్పవచ్చు. వరలక్ష్మమ్మ గారు రచించిన 'వసుమతి' నవలలో ముఖ్య పాత్ర అయినా మహాలక్ష్మమ్మ తన చిన్న కూతురు వసుమతి పుస్తకం చదువుతూ ఉండటం చూసి అసుర సంధ్య వేళ చదవవద్దు అని, ఎన్నిసార్లు చెప్పాలని మందలిస్తుంది. ఈ సన్నివేశంలో మహాలక్ష్మమ్మ గారు తన కూతురితో పలికిన మాటల వలన ఆనాడు అసుర సంధ్య వేళలో చేయకూడని పనుల్లో చదువుకోవటం కూడా ఉన్నదని తెలుస్తుంది.

రామచంద్రుడు త్రిపుర సుందరిని వివాహం చేసుకుంటాను అన్నప్పుడు మహాలక్ష్మమ్మ గారు కోడలు నలుపు అయితే వంశం మొత్తం నల్లగా ఉంటుందని రామచంద్రుడు వివాహం చేసుకోవటానికి అంగీకరించదు. అదేవిధంగా వసుమతి భర్త ఆనందరావు తల్లి కామాక్షమ్మ కొంత పూర్వకాలపు ఆచారాలను పాటించే వ్యక్తిగా కనిపిస్తుంది. ఆమె ఉద్దేశంలో చదువుకున్న స్త్రీలు భర్త మాట వినరని, పద్ధతులు, ఆచారాలు పాటించరని గుడ్డిగా విశ్వసించేది. అందువల్లనే చాలా కాలం పాటు తల్లులు కూడా వారి కుమార్తెలు చదువుకోటానికి ఇష్టపడేవారు కాదు. ఆడపిల్ల చదువు వారి పెళ్లికి అడ్డంకి గా మారుతుందని ఒక మూఢనమ్మకం ఆనాడు సమాజంలో బలంగా ఉందని అనటానికి ఇది నిదర్శనం గా కనిపిస్తున్నాయి.

వసుమతి నవలలో వసుమతికి చిన్నతనంలోనే బాల్యవివాహం చేసి, ఆమె రజస్వల అయిన తర్వాత కాపురానికి పంపిస్తారు. ఆ కాలంలో ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ కుమార్తెలకు రజస్వల కాకముందే పెళ్లి చేసేవారు. ఒకవేళ ఆడపిల్ల రజస్వల అయిపోతే అటువంటి వారికి పెళ్లి చేయడం దాదాపు అసాధ్యం అయ్యేది. అంతేకాకుండా ఆ సంఘటన తల్లిదండ్రులకు తలవొంపులు కూడా తెచ్చేది. అందువల్ల ఆనాటి సమాజంలో దాదాపు అన్ని బాల్యవివాహాలు కూడా ఇలాగె జరిగేవి. ఇటువంటి ఆచారం ఒక మూఢనమ్మకం అని తెలియజేయటానికి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు ఈ వసుమతి నవలలో చక్కగా చిత్రించారు.

ఈ విధంగా కనుపర్తి వరలక్ష్మమ్మ గారు తన రచనలల్లో ఆనాటి సమాజంలో ఉన్న అనేక సామాజిక అంశాలను దురాచాలను చక్కగా తనదైన శైలిలో వివరించటం జరిగింది.

**ఆధార గ్రంథాలు:**

కన్యాశ్రమము- కథల సంపుటి

వసుమతి-నవల

పిల్లల నాటికలు

కథానిక స్వరూప స్వభావాలు- డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి

ఆధునిక తెలుగు సాహిత్యంలో భిన్న ధోరణులు– ఆచార్య కె.కె. రంగనాథచార్యులు

తెలుగు కథా రచయితలు–పరిశీలనాత్మక వ్యాస సంకలనం